మృతురాలి కుటుంబానికి పరామర్శ



లక్ష్మీనారాయణమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి

పామిడి: సారకాయలపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి వదిన ఆర్ లక్ష్మీనారాయణమ్మ(64) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి గ్రామానికి వెళ్లి లక్ష్మీనారాయణమ్మ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మృతురాలి భర్త ఆర్ లక్ష్మీనారాయణరెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పార్టీ అగ్రనేతల ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేస్తున్న నిందితులపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది ఎండీ.ఖలీల్ కోరారు. మంగళవారం వన్‌టౌన్ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. 'రవిరవి22316' అనే ఇన్‌స్టాగామ్ ఐడీ నుంచి అర్ధనగ్న, అశ్లీల పోస్టులను ట్రోల్స్ చేస్తూ పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఖలీల్ పేర్కొన్నారు. ఐటీడీపీ వేదికగా జరుగుతున్న ఈ దుశ్చర్యలను తీవ్రంగా పరిగణించి సమాజంలో అశాంతి నెలకొల్పేందుకు యత్నిస్తున్న వారిపై ఐటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని కోరారు. న్యాయవాది ఆరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్‌ఆచారి, వంశీయాదవ్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



హెడ్‌కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శింగనమల: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ అన్ని శుభాలే జరగాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆకాంక్షించారు. కోటి ఆశలు, కొంగొత్త ఆశయాలు, బలీయమైన సంకల్పంతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తాడిపత్రి: తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి ఒక్కరి ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షించారు.



వై.వెంకటరామిరెడ్డి



వీరాంజనేయులు



ఆలూరు సాంబశివారెడ్డి



కేతిరెడ్డి పెద్దారెడ్డి

మొక్కజొన్న పంట కోత ప్రయోగాలు

పుట్లూరు: అరకటివేముల గ్రామంలో మంగళవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాలను ఏఓ కాత్యాయని పరిశీలించారు. గ్రామానికి చెందిన పావని అనే రైతు పొలంలో మొక్కజొన్న దిగుబడిపై పంట కోత ప్రయోగాలను చేపట్టగా 5 మీటర్ల చుట్టుకొలత పరిధిలో 12.8 కిలోల దిగుబడి వచ్చినట్లు ఆమె తెలిపారు. ఏఈఓ హరి, రైతులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరిస్తాం

శింగనమల: రీసర్వే చేసిన గ్రామాల్లో భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం నిదనవాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం లేకుండా చూడాలని, భూములు సర్వే చేస్తున్నప్పుడు ఒక్కొక్క రైతుతో రూ.550 అదనంగా ప్రభుత్వానికి రుసుం చెల్లిస్తున్నారని, ఈభారం లేకుండా చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి తహసీల్దార్‌ను కోరారు. దళితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. రీసర్వే సక్రమంగా చేయలేదని, పలు ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పరిష్కరించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: వీలైనంత త్వరగా భూ సమస్యలను పరిష్కరిస్తానని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజా తెలిపారు. మల్లాగుండ్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న వారు అర్జీలు ఇస్తే త్వరగతిన పరిష్కరిస్తామన్నారు. మండల సర్వేయరు షర్మానీ, ఆర్ఐ నారాయణమ్మ, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి

గుత్తి: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ శర్మ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు మంగళవారం రామశర్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యం చెప్పారు. సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షులు పీడీ రత్నం, పలువురు సీనియర్,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



రామశర్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న న్యాయమూర్తులు

అయోడిన్ లోపాలపై కళాజాతా

గార్లదిన్నె: అయోడిన్ లోపాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య పేర్కొన్నారు. మంగళవారం గార్లదిన్నె, గుడ్డాలపల్లి, శిరివరం, తిమ్మంపేటలో సంస్థ ఆధ్వర్యంలో ఐటీసీ సహకారంతో అయోడిన్ లోపాలు వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై పేస్ కళాజాతా బృందం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు.

మదాసి, మదారి కురుబలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి

గుంతకల్లు రూరల్: మదాసి కురుబ, మదారి కురుబలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్, నాయకులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

గార్లదిన్నె: పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులపై పంటల బీమా ప్రీమియం భారం మోపడం తగదన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, నాయకులు తాతిరెడ్డి, వెంకటేష్, రామయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ కార్యాలయాల్లో న్యూ ఇయర్ వేడుకలు రద్దు

గార్లదిన్నె: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం న్యూ ఇయర్ వేడుకలు రద్దు చేసినట్లు తహసీల్దార్ ఈరమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందిన నేపథ్యంలో ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించిందన్నారు. బుధవారం కూడా సంతాప దినం ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో న్యూఇయర్ వేడుకలు నిర్వహించమన్నారు.

గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఏ గ్రామంలోనైనా న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మద్యం సేవించి గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. యల్లనూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

వాహనాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఎస్ఐలు నాగమాణిక్యం, ఆజాద్, పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్, ఆర్సీ లేని డ్రైవర్లకు జరిమానా విధించారు.

ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు. పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యశ్వంత్, ఎస్.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా వెంకీ, అరవింద్, సహాయ కార్యదర్శులుగా పునీత్‌కుమార్, సాయికుమార్, భార్గవ్‌కుమార్‌తోపాటు మరో 14మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

వెటర్నరీ ఆసుపత్రికి పక్కా భవనాన్ని నిర్మించండి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వెటర్నరీ ఆసుపత్రికి వెంటనే పక్కా భవనాన్ని నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వద్ద వారు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ తాడిపత్రి పరసర ప్రాంతాల్లోని మూగజీవుల చికిత్స కోసం రోజూ వందలాది మూగ జీవాలను చికిత్స కోసం వెటర్నరీ ఆసుపత్రికి తీసుకొస్తుంటారన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనంలో అరకొర సౌకర్యాల నడుమ పశువులకు చికిత్సనందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, సూరి, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు

గుత్తి రూరల్: ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం లచ్చానుపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరిగే ప్రదేశం వద్ద కూలీలతో ఎంపీడీఓ మాట్లాడారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

గుత్తి: కోరం లేకపోవడంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించడానికి ప్రయత్నించారు. అయితే మున్సిపల్ కౌన్సిలర్లు హాజరు కాలేదు. దీంతో కోరం లేకపోవడంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని కమిషనర్ చెప్పారు.

నాగు పాము కలకలం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జడ్ వీరారెడ్డి కాలనీలో మంగళవారం ఓ నాగు పాము కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి ఇంటిలోకి నాగు పాము ప్రవేశించింది. నాగు పాము ఇంటిలోకి ప్రవేశించడంతో ఇంటిల్లీ పాది భయంతో బయటకు పరుగులు తీశారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తి తాడుతో పాముకు ఉరి వేసి పట్టి బయటకు తీసుకొచ్చాడు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు మాలధారులు తెలిపారు. ఉదయం శ్రీధర్మశాస్త్ర ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 11 గంటల నుంచి అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

పుట్లూరు: ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దవడుగూరు : సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఉషారాణి, ఎస్ఐ ఆంజినేయులు పేర్కొన్నారు. మంగళవారం విరుపాపురంలోని ఆర్టీటీ పాఠశాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.

గుంతకల్లు రూరల్: మల్లేనిపల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ, దేవదాయశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఇతర శాఖల ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలో తహసీల్దార్ రమాదేవి పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయండి

బుక్కరాయసముద్రం: రైతుల ఆర్థిక అభివృద్ధికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం రెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులకు 90 శాతంతో బిందు సేద్యం పరికరాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం డ్రోన్‌తో స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. డీఏఓ ఉమా మహేశ్వరమ్మ, ఎంపీపీ సునీత, ఏడీఏ రవి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్న కుమార్, ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, పట్టు పరిశ్రమ ఏడీ ఆంజినేయులు పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు మరువలేనివి

గుంతకల్లుటౌన్: దేశ ఆర్థికంగా అభివృద్ధి కోసం దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు మరువలేనివని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభను నిర్వహించారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ ఆర్థిక పురోగతికి సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కామర్స్ విభాగపు హెచ్ఓడీ డాక్టర్ జనార్ధన్ శాస్త్రీ, అధ్యాపకులు డాక్టర్ గోపినాయక్, ఓబులేసు, రవిశంకర్‌శర్మ పాల్గొన్నారు.